# నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506



## రిపోర్టర్స్ కావలెను

నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యూమో పంపండి.

95150 34555
84979 20544



ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | ఆదివారం, 20 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 38 | పేజీలు: 4 | వెల:10/-




## మన బడిని మనమే బాగు చేసుకుందాం..

### ఒకే వేదికపైకి.. 25 ఏండ్ల చిన్ననాటి స్నేహితులు

### నేడు ఈటూర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**నాగారం, ఏప్రిల్ 19 :** మండల పరిధిలోని ఈటూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పూర్వ విద్యార్థులు ఈటూర్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఆదివారం ఈటూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సొసైటీ విద్యావంతులు ఈటూర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వాసం ప్రభాకర్, చింతలరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ బండి సాయన్న, డాక్టర్ గుండు కిష్టయ్య ఆధ్వర్యంలో పాఠశాల 25 ఏండ్ల పూర్వవిద్యార్థుల సౌజన్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, విశిష్ట అతిథులుగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్‌పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహ, ప్రత్యేక అతిథులుగా జిల్లా విద్యాధికారి కె.అశోక్, అడిషనల్ ఎస్పీ కొండం పార్థసారథి, అతిథులుగా తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, ఎంపీడీవో మారయ్య, సీఐ ఈ.రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఎం.అవిలయ్య పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 25 ఏండ్లుగా పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలవనున్నారు.

#### కార్పొరేట్ పాఠశాల ఏర్పాటే ఎజెండా..

ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు, మేధావులు పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో పునర్నిర్మించేందుకు ఆదివారం జరిగే సమ్మేళనంలో విధివిధానాలను ప్రకటించనున్నారు. కావున నాటి విద్యార్థులు, నేటి విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.







# భూ భారతి

## రైతు హక్కు భద్రం!

**హైదరాబాద్ ప్రధాన ప్రతినిధి, నేటి ప్రస్థానం:** భూ వివాదాలు.. ఇది ఇప్పటి మాట కాదు. రాజుల పాలన నుంచి నిన్న మొన్నటి బీఆర్ఎస్ పరిపాలన వరకు సాగిన ఓ పెద్ద ప్రహసనం. నిజాం పాలన.. ఆ తర్వాత మిలిట్రీ గవర్నమెంట్.. ఆ తర్వాత వచ్చిన రకరకాల ప్రభుత్వాల పాలనల్లో రైతుల బాధలు వర్ణించలేనివి. భూములపై హక్కుల కోసం పోరాటం చేసిన సందర్భాలెన్నో! దున్నేవాడిదే భూమంటూ నినదించిన గొంతుకలెన్నో! స్వరాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణలో మొదటి ప్రభుత్వం

మిగతా 2 లో

# ఐపీఎల్‌కు తగ్గని క్రేజ్

- మ్యాచ్‌లు చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్న నగరవాసులు
- ఇట్ల టికెట్లు పెడుతున్నరో లేదో అట్ల ఖాళీ!
- ఎస్ఆర్‌హెచ్ వర్సెస్ ముంబయి మ్యాచ్ టికెట్లు కొనేందుకు లక్ష మంది క్యూ
- ఇప్పటి వరకు ఐపీఎల్ మ్యాచ్‌ల్లోనే ఇదో రికార్డు



04



## ఇంద్రవెల్లి ఘటనకు 45 ఏళ్లు

వివరాలు 2 పేజీలో..




"సంస్కృతంతో తెలుగు కాలరాయొద్దు"

జవానైనా.. కిషానైనా.. మా నాన్నే..

మీ సాహితీ ప్రస్థానంలో..



### చర్యలు అందరిపైనా..

## తనపైనేనా

- చట్టం అందరికీ సమానమా?
- 2 వేల మంది షేర్ చేశారు
- మరోమారు స్మితా సబర్వాల్ పోస్ట్

04

## మరోమారు హైడ్రా దూకుడు

### ఏపి ఎమ్మెల్యే ఫామ్‌హౌజ్ కూల్చివేత

### మియాపూర్‌లోనూ ఆక్రమణల తొలగింపు




02



# ఇంద్రవెల్లి ఘటనకు 45 ఏళ్లు

**1981 ఏప్రిల్ 20న ఆదిలాబాద్ ఆదివాసీలకు చేదు జ్ఞాపకాలను మిగిల్చిన రోజు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని ఇంద్రవెల్లిలో ఓవైపు సంత జరుగుతోంది. ఈ సంతలో సరుకులు కొనడానికి జనం వేస్తే ... మరోవైపు గిరిజన రైతు కూలీ సంఘం' సమావేశానికి జనం వస్తున్నారు. సభకు అనుమతి లేదని పోలీసులకు, ప్రజలకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆ క్రమంలో జరిపిన కాల్పుల్లో 13 మంది ఆదివాసీలు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. ఇంద్రవెల్లి పోలీస్ కాల్పుల ఘటనను యావద్దేశం ముక్త కంఠంతో ఖండించింది. కాల్పుల ఘటనతో కుగ్రామంగా ఉన్న ఇంద్రవెల్లి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రతిపక్షాలు, ప్రజాహక్కుల సంఘాలు, సాహితీలోకం 'స్వతంత్ర భారత జలియన్‌వాలా బాగ్' అంటూ నిరసించింది.**

కుమ్రంభీం ఆధ్వర్యంలో ఆదివాసీలు సాగించిన 'జోడేన్ ఘాట్'ను నిజాం అణచివేశాడు. ఆ తర్వాత నిజాం ప్రభుత్వం కొన్ని సంస్కరణలు చేపట్టింది. ఆదివాసీల తిరుగుబాటు మూలాలపై మానవ పరిణామ శాస్త్రవేత్త 'హేమన్ డార్ఫ్' అధ్యయనం సూచనల మేరకు సుమారు లక్షన్నర ఎకరాల అటవీ పోడు భూములకు పట్టాల పంపిణీ చేశారు. ఆదివాసీలను అక్షరాస్యులగా చేసేందుకు ప్రత్యేక స్కూళ్లు, వృత్తి శిక్షణ కేంద్రాలు తెరిచారు. గిరిజన తెగలు, ప్రాంతాలను నోటిఫైడ్ ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కేస్లాపూర్ నాగోబా జాతర వేదికగా ఆదివాసీల సమస్యలు, ఆర్జీలను పరిష్కరించేందుకు 'దర్బార్'ను ప్రారంభించారు. గిరిజన ప్రాంతాలు, తెగలను గుర్తిస్తూ నోటిఫైడ్ ప్రాంతాలను ప్రకటించి, బయటి ప్రాంత వ్యక్తులపై ఆంక్షలు విధించింది. ఈ చర్యలతో ఆదివాసీలకు కాస్త ఉపశమనం దొరికింది. ఆ తర్వాత హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయింది. ఆదివాసీ ప్రాంతాలను రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ లో చేర్చారు. అనంతరం రాజ్యాంగబద్ధమైన చట్టాలను తెచ్చారు. ఆ తర్వాత పకడ్బందీ చట్టాలు వచ్చినా... అందులోని లోపాలతో పెద్ద విస్తీర్ణంలో ఆదివాసీల భూములు అన్యాక్రాంతమయ్యాయి.

1971 నాటికి గుడిహత్నూర్, ఆసిఫాబాద్, కరీంనగర్, నిర్మల్ ప్రాంతాలను కలుపుతూ రోడ్డు సౌకర్యం ఏర్పడి బయటి వ్యక్తుల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ ప్రాంతానికి వలసలు పెరిగాయి. వడ్డీ వ్యాపారులు క్రమంగా ఆ ప్రాంతాల్లో బలపడ్డారు. ఆదివాసులుగా గుర్తించని బంజారా/లంబాడాల చేతుల్లోకి భూమి, అధికారాలు మారుతుండటంతో గోండ్ ఆదివాసీల ప్రాబల్యం రోజురోజుకూ తగ్గుతూ వచ్చింది. ఇలా జీవనాధారమైన భూములు, పుట్టిన ప్రాంతంలోనే తమ అస్తిత్వం అన్యాక్రాంతం కావడం ఇంద్రవెల్లి పోరాటానికి కారణమైంది . ఈ క్రమంలో 1983లో ఇంద్రవెల్లి కాల్పులు జరిగిన ప్రాంతంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలో భాగంగా అమరవీరుల స్థూపం నిర్మించారు. అక్కడి ప్రజలకు కొన్ని మౌలిక సదుపాయాలను కల్పించింది. ప్రతి ఏటా ఏప్రిల్ 20న పెద్ద ఎత్తున అక్కడి ఆదివాసుల ఏకమై స్మరించుకోవడం జరుగుతోంది. ఇంద్రవెల్లి ఘటనకు 45 ఏళ్లు గడిచినా ఆదివాసీల భూసమస్యలు చాలా వరకు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. అదే సందర్భంలో ఆదివాసీలు, లంబాడ గిరిజనుల మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతోంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయినా బీసీ, ఎస్సీ, ఎస్టీలలో మెజార్టీ ప్రజల చేతిలో భూమి లేదు. వారికి ఈ రాజ్యంలో వాటా లేదు. అన్ని రంగాల్లో వారు వెనుకబడ్డారు. ఇంకా అక్కడ అగ్రవర్ణ పెత్తందారుల ఆధిపత్యమే కొనసాగుతోంది.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
79895 78428

# భూ భారతి

## రైతు హక్కు భద్రం!



**హైదరాబాద్ ప్రధాన ప్రతినిధి, నేటి ప్రస్థానం:** భూ వివాదాలు.. ఇది ఇప్పటి మాట కాదు. రాజుల పాలన నుంచి నిన్న మొన్నటి బీఆర్ఎస్ పరిపాలన వరకు సాగిన ఓ పెద్ద ప్రహసనం. నిజాం పాలన.. ఆ తర్వాత మిలిట్రీ గవర్నమెంట్.. ఆ తర్వాత వచ్చిన రకరకాల ప్రభుత్వాల పాలనల్లో రైతుల బాధలు వర్ణించలేనివి. భూములపై హక్కుల కోసం పోరాటం చేసిన సందర్భాలెన్నో! దున్నేవాడిదే భూమంటూ నినదించిన గొంతుకలెన్నో! స్వరాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణలో మొదటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేసీఆర్ సైతం రైతుల సమస్యలు, భూ వివాదాలు తొలగించేందుకు కొంత ప్రయత్నం చేశారు. ధరణిని తీసుకొచ్చి కొన్ని సమస్యలు పరిష్కారానికి యత్నించారు. కానీ ధరణి రైతుల ఆదరాభిమానాలను పొందలేకపోయింది. అనాటి ప్రభుత్వంలో రైతులు ధరణిని తీసేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేసినా అప్పటి ముఖ్యమంత్రి అదే స్వరంతో ధరణి కంటే మంచి వ్యవస్థ లేదని..భవిష్యత్‌లో రాబోదని..ఎట్టి పరిస్థితుల్లో తీసేది లేదని తెగేసి చెప్పారు.ఆ ధోరణే బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి దారి తీసిందని విశ్లేషకుల అభిప్రాయం.ఈ పరిస్థితుల్లో నాటి కాంగ్రెస్ అన్నదాతల సమస్యలు అర్థం చేసుకొని అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ప్రకటించారు. అన్నట్లుగానే మొన్నటి సారి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ధరణిని తీసేసి దాని స్థానంలో భూ భారతిని తెచ్చింది. ధరణితో ఉన్న తిప్పలను తప్పించేందుకు అనేక రక్షణ చర్యలను చేపట్టింది. భూ హక్కులను సరళీకరించింది. అవి ఏంటో నేటి ప్రస్థానం పాఠకుల కోసం..

### గతంలోని ఆర్ఓఆర్ చట్టాలు..

గత ప్రభుత్వాలు వివిధ భూ చట్టాలు తేగా.. వాటి ప్రకారం హక్కుల రికార్డులు వివిధ రూపాల్లో ఉండేవి.వాటిలో ప్రధానంగా ఖాస్రా పహాణీ,1బీ రిజిస్టర్,ఆర్ఓఆర్1బీ,ధరణి.ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతిని అమల్లోకి తెచ్చారు.

**ఖాస్రా పహాణీ:** హైదరాబాద్ రాష్ట్రంలో 1948లో చేసిన ఆర్ఓఆర్ చట్టం కింద హక్కుల రికార్డుగా పరిగణించబడింది.

**1బీ రిజిస్టర్:** ఉమ్మడి రాష్ట్రంలో 1971లో ఆర్ఓఆర్ చట్టం చేసి 1బీని హక్కుల పత్రంగా మార్చారు. ఈ 1బీ రిజిస్టర్‌నే 2017లో నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ద్వారా సవరించి ధరణిలో పొందుపర్చారు. 2020 చట్టం కింద ధరణినే హక్కుల రికార్డుగా ప్రకటించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి-2025 చట్టం కింద హక్కుల రికార్డును ప్రకటించింది.

### భూ భారతి చట్టంలోని ప్రధానాంశాలు..

ఆర్ఓఆర్ చట్టాల ప్రధాన ఉద్దేశం హక్కుల రికార్డును రూపొందించడం.. భూమిపై హక్కులు సంక్రమించినప్పుడు ఆ రికార్డులో మార్పులు చేయడం.. సరిగ్గా ఇప్పుడు అదే పనిని కొత్త చట్టం భూ భారతి చేస్తుందనడంలో ఎలాంటి అతిశయం లేదు.

- భూమి హక్కుల రికార్డును రూపొందించి నిర్వహించడం..
- హక్కుల రికార్డులో ఉన్న తప్పులను సవరించడం
- భూమిపై హక్కులు సంక్రమించినప్పుడు హక్కుల రికార్డులో మ్యుటేషన్ చేయడం..
- హక్కుల రికార్డుకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధించిన వ్యవస్థ ఉండటం..

### కీలకాంశాలు..

ధరణిలోని లోపాలను సరిచేస్తూ రైతుల హక్కుల చిక్కులను తప్పించేందుకు నూతనంగా వచ్చిందే భూభారతి. ఈ చట్టంలో అనేక కీలకాంశాలున్నాయి. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశమిచ్చారు.రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ తప్పనిసరి చేశారు.పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి వీలు కల్పించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయనున్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డుల్లో నమోదు చేయనున్నారు. పాసుపుస్తకాల్లో భూమి సంబంధించిన పటాన్ని ముద్రించనున్నారు.భూ సమస్య పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అంతేకాక భూ ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు. ఇంటి స్థలాలు,ఆబాది,వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డును తయారు చేయనున్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించనున్నారు. గ్రామ రెవెన్యూ రికార్డులను నిర్వహించనున్నారు. మోసపూరితంగా హక్కుల రికార్డు మార్చి ప్రభుత్వ,భూదాన్,అసైన్డ్,ఎండోమెంట్,వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం నూతన చట్టంలో పొందుపర్చారు.

### ఏ భూములకు వర్తిస్తుందంటే..

**భూభారతి చట్టం వ్యవసాయ, వ్యవసాయేతర, ఆబాదీలకు వర్తిస్తుంది. ప్రభుత్వ, జాగీరు, ఇనాం భూములకు ఈ చట్టం వర్తించదు.**




### చట్టంలోని ముఖ్యాంశాలు

**రికార్డ్ ఆఫ్ రైట్స్: భూమిపై ఎవరికి,ఎలాంటి హక్కులున్నాయో తెలిపే రికార్డు.దీన్ని భూ యజమానుల రికార్డు అని కూడా అనవచ్చు.ఈ రికార్డులో పేరు ఉన్న వారికే భూ యాజమాన్య హక్కు పత్రం,పట్టాదారు పాసుపుస్తకం ఇస్తారు.ఆర్ఓఆర్‌లో ఎవరి పేరు ఉంటే వారే భూ యజమానిగా పరిగణించబడుతారు. భూముల రిజిస్ట్రేషన్ ఈ రికార్డు ఆధారంగానే జరుగుతుంది.ప్రభుత్వం రైతులకు ఏదైనా మేలు చేయాలనుకుంటే ఈ రికార్డు ప్రకారమే చేస్తుంది.అందుకే ఇది చాలా కీలకమైనదని చెప్పవచ్చు.**

### రికార్డుకు ఉన్న విలువ..

భూ భారతి చట్టంలో హక్కుల రికార్డుకు ఎంతో విలువనిచ్చారు. భూమి హక్కుల రికార్డులో ఉన్న వివరాలు తప్పు అని నిరూపించేవరకు లేదా చట్ట ప్రకారం రికార్డుల్లో మార్పు చేసే వరకు సరైనవిగా భావించాలి. ఇక పాసుపుస్తకానికి రిజిస్టర్ దస్తావేజుకు ఉన్న విలువ ఉంటుంది.

### రికార్డుల నకలు ఇలా..

భూ భారతి పోర్టల్‌లో భూ హక్కుల రికార్డులు అందరికీ అందుబాటులో ఉంటాయి. ధరణిలో ఎవరైనా తమ రికార్డులను కనిపించకుండా చేసుకునే అవకాశం ఉండేది. భూ భారతిలో మాత్రం ఆ అవకాశం లేదు. హక్కుల రికార్డు పూర్తి పారదర్శకంగా అందరికీ కనిపిస్తుంది.

ఎవరైనా భూ హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ పొందాలంటే భూ భారతిలో ఉన్న ఫారంలో పది రూపాయలు చెల్లించి దరఖాస్తు చేయాలి. అప్పుడు తహసీల్దార్ సర్టిఫైడ్ కాపీ జారీ చేస్తారు.

### భూధార్ కార్డు..

డిజిటల్ ఇండియా భూమి రికార్డుల ఆధునీకరణ పథకంలో భాగంగా ప్రతి భూ కమతానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు భూధార్ ఇచ్చే కార్యక్రమాన్ని మొదలుపెట్టాయి. అయితే తెలంగాణ రాష్ట్రంలో తెచ్చిన కొత్త చట్టం భూ భారతి ద్వారా ప్రతి భూ కమతానికి భూధార్ సంఖ్య ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి భూ యజమానికి భూములను సర్వే చేయకముందు తాత్కాలిక నంబర్, సర్వే అనంతరం శాశ్వత నంబర్ ఇవ్వాలని నియమాన్ని పొందుపర్చారు.

### అమలు ఎలా..

భూ భారతి చట్టం-2025ను ప్రభుత్వం ఏప్రిల్ 14 నుంచి అమల్లోకి తెచ్చింది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి ఈ నూతన చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే.ఈ చట్టాన్ని మొదటగా తెలంగాణ వ్యాప్తంగా 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నారు. అక్కడ ఎదురయ్యే సమస్యల ఆధారంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఇప్పటికే ఆ మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. వీటిల్లో రెవెన్యూ ఉన్నతాధికారులతో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను దగ్గరుండి పరిష్కరించనున్నారు.

# ఏపీ ఎమ్మెల్యే ఫామ్‌హౌజ్ కూల్చివేత

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** హైడ్రా మరోమారు దూకుడు పెంచింది.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ఆక్రమణలకు పాల్పడింది ఎవరన్నది చూడకుండా కూల్చివేతలే టార్గెట్ గా వెళున్న హైడ్రా ఇప్పుడు ఏపీ టీడీపీ ఎమ్మెల్యేకు భారీ షాక్ ఇచ్చింది. ఏపీలోని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు చెందిన ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు. శనివారం కొండాపూర్ లోని సర్వే నంబర్ 79లో ఉన్న ఎమ్మెల్యే ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు. ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఫామ్ హౌస్ తో పాటు ఆఫీస్ నిర్మించినట్లు అధికారులు తెలిపారు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్ లో ఉండగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నిర్మాణాలు చేపట్టారని..సర్వే నెంబర్ 79 లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు అధికారులు. ఇకపోతే అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మియాపూర్ వరల్డ్ వన్ స్కూల్ వెనుక ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేస్తోంది. షెడ్లను జెసిబిల సహాయంతో కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగాయి. గతంలో సంబంధిత వ్యాపారులకు నోటీసులు ఇచ్చిన స్పందించకపోవడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ లోని సర్వే నెంబర్ 213, 214 ,215 ,216 లో స్కూప్స్ ఐస్ క్రీమ్ కంపెనీ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. దీంతో శ్రీరంగపురం కాలనీ, సుందరయ్య కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ లతో పాటు- సుమారు 7, 8 కాలనీ స్థానికులు హైడ్రా అధికారుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. రహదారి కబ్జా చేసి చుట్టూ కొంతమంది వ్యక్తులు ప్రహరీ గోడ నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని వాపోయారు. అక్రమ కట్టడాలపై ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న నాధుడే లేడని.. కానీ, ముత్యాలమ్మ అనే మహిళ ఒంటరి పోరాటం చేస్తూ హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదుతో హైడ్రాధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేయడం సంతోషంగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి బాధిత కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# రెండ్రోజులు వర్షాలు

### ఉరుములు, మెరుపులతో పడే ఛాన్స్

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణలో రానున్న రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో మధ్యాహ్నం 2 గంటల తర్వాత వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు చోటు-చేసుకోనున్నట్లు- తెలిపింది. ఈ నేపథ్యంలో ఈదురుగాలులు, వడగండ్ల వానలు కూడా కురిసే అవకాశముందని పేర్కొంది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఇక హైదరాబాద్ నగరంలో, నిన్నటితో పోలిస్తే నేడు వర్ష తీవ్రత కొంత తక్కువగానే ఉంటు-ందని 'తెలంగాణ వెదర్ మ్యాన్' అంచనా వేశారు. అయితే నగర పరిధిలోని ఘట్‌కేసర్, కీసర, దమ్మాయిగూడ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశముందని తెలిపారు. కాప్రా, సైనిక్‌పురి, నాచారం, మల్లాపూర్, ఈసీఐఎల్, చెర్లపల్లి, నారపల్లి, బోడుప్పల్, నేరేడ్‌మెట్, యాప్రాల్ వంటి ప్రాంతాల్లో వచ్చే రెండు గంటల్లో వర్ష ప్రభావం కనిపించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



## జవానైనా.. కిషానైనా..
# మా నాన్నే..

దేశ జనులకు కంటికి కునుకు జవాన్ ఐతే
కడుపుకు కూడు కిసాన్ కానీ
నా కుటుంబానికి జవాన్ కిసాన్ నా నన్నే..

విధి కుక్కలు కరవటానికి విధిలో కాచుకొని
చీకటిలో క్షీతిలు పేరుస్తాయని కూతురి కోరికను
పురిట్లో పుట్టమన్ను కప్పుతాడు నాన్న..

నాన్న ప్రేమను అర్థంచేసుకోవాలి అంటే
నీవు కావాలి నాన్న లేకుంటే
నీ కుటుంబాద్యతలకు నీవు నాన్న ఐన కావాలి..

కన్నీటి సముద్రం గుండెల్లో ఎరై పారుతున్న
ఎంత మంది చూసిన కంట్లో ఏరు కరువు
ఎందుకంటే
సమస్యలకు తలొగ్గడు అదే నాన్న..

చిరంజీవులు చీడపురుగులు
కలగల్సిన ప్రపంచము ఇది
దారి చూపే మొదటి గురువు నాన్నే..

కూతురు కడుపు మార్చుకొని పడుకుంటే
తల్లి పేగు ఎలా అలమటిస్తుందో
నాన్న హృదయం నిండా బిడ్డ కన్నీళ్లు..

సముద్రం చాలా చిన్నది నీళ్ళు
ఎక్కువైతే జనాలను ముంచుతది కానీ
నాన్న హృదయంలో సమస్యలకు పొర్లేనిరు పరగానదు..

ఈ కాలములో సంపాదనే జీవితములో
సగం జీవితానందాన్ని అర్థిస్తుంది కానీ
తండ్రి జీవితకాల సంపాదన కూతురి ఆనందం..

వాకిట్లో ముగ్గు దిద్దే కూతురు
అతింట్లో కాపురని చక్కబెడుతుంటే
నాన్న హృదయం హరివిల్లు అల్లహాలంతో
పొగిపోతుంది..

కాలానికి కవితోడైతే
కవికి అక్షరాలే ఆయుధాలు కానీ
కూతురే తండ్రియైతే కుటుంబానికి అదే
వెయ్యేనుగులా బలం ...

ఈ అంతర్జాల కాలములో
ఇంద్రజాలం కరవు కానీ
తండ్రి కూతుళ్ళ ప్రేమకు లేదు కరువు..

బయట ప్రమాదాలు పొలకరుస్తునట్లు ఇంట్లో
ప్రమిదలు ఎలా వెలుగు నిస్తాయో
బిడ్డ భవిష్యత్తు తండ్రి జీవితములో అసలైన
వెలుగు..

విద్యార్థి ఆలోచన అడుగులు
దేశ భవిష్యత్తుకు పునాది కానీ
తండ్రి ఆలోచనే బిడ్డ భవిష్యత్తుకు నాంది..

మధ్యరేఖ కుటుంబంలో అలి
అవసరాలు తీర్చడంలో వెనుకంజ వేస్తాడేమో గాని
కూతురి కోరికలు తీర్చడంలో ముందంజ నాన్నది..

పుట్టక ముందు పుట్టెడు సోకం
పుట్టినక పట్టెను సుఖము మీకు గాని
గండ్లు మూసుకొని కటికొనికి ఇస్తివ నాన్న...

కోట్లు, కోటలు సంపాదించి
ఇచ్చే కొడుకు కన్న
కూతురి కొండంత ప్రేమ కోహినూర్ నాన్నకి..

ఎవడి కలకు వాడు స్వార్థపు
చెక్కర్లు కొడుతున్న చుక్కల ప్రపంచములో గూడ
నాన్న చెమటే బిడ్డలు కలగన్న కలలా ప్రపంచము

ఎద నింద ఏరు
కళ్ళ నిండా కనువిందు
కళ్ళ ముందు నా కూతురి పెండ్లి.....

పై సదువుకి పట్నము
సదువు తగ్గ అల్లుడికి కట్నము
తండ్రి కూతురికి ఇచ్చే జీవితకాల బహుమానం..



వెల్లెకి శిరీష
7702515415

# "సంస్కృతంతో తెలుగు కాలరాయొద్దు"

**వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు భాషను కాదని ఇంటర్మీడియట్ స్థాయిలో సంస్కృతాన్ని తెలుగు స్థానంలో ప్రవేశపెట్టడం వల్ల తెలుగు భాష క్రమక్రమంగా మానవ మస్తిష్కాల్లోంచి కనుమరుగు కాక తప్పని పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల తెలుగు భాష కుంటుపడే పరిస్థితి దాపురించి ఒక గీతను మలపకుండా చిన్నగా చేయాలంటే దాని పక్కన పొడుగు గీత గీస్తే సరి. అది యాంత్రికంగా, సాంకేతికంగా, దృశ్యమానంగా చిన్నగా మారిపోతుంది. అట్లాగే ప్రభుత్వం తప్పనిసరి చేయని మాధ్యమం విషయములో జరిగిన జరుగుతున్న ఒక సంఘటనను మనం ఉదహరించుకుందాం.**



**పాఠశాల స్థాయిలో ప్రభుత్వం తెలుగుతోపాటు ఆంగ్ల మాధ్యమమును ప్రవేశపెట్టింది. ఫలితంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో 99% పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలోనే విద్యార్థులు చదువుతున్నారు. తత్ఫలితంగా తెలుగు మాధ్యమాన్ని ఏర్పడకుండా ఎత్తివేసారు.**




2025-2026 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ స్థాయిలో ద్వితీయ భాష తెలుగు స్థానంలో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డ్ నిర్ణయం తీసుకోవడం తెలుగు భాషాభిమానుల గుండెల్లో విధ్వంసం సృష్టించింది. సంస్కృత భాష ప్రవేశ పెట్టడం వల్ల తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర కనుమరుగు కావడం తథ్యం. ఇప్పటికే కార్పొరేట్ కళాశాలలో చదివే విద్యార్థులకు సంస్కృతం కాదనీ తెలుగు భాష ఐచ్ఛికంగా ఎంపిక చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో సంస్కృత భాష ప్రవేశపెడితే తెలుగు పరిస్థితి ఏమిటో అర్థం కాకుండా పోదు.

**తెలుగు కంటే నిజానికి సంస్కృత భాష చాలా సంక్లిష్టమైన భాష. అలాంటిది సంస్కృతంలోని ఎక్కువ మార్కులు వస్తాయని నమ్మించడం కార్పోరేటు మాయాజాలంలోని ఒక వ్యూహం. ప్రైవేట్ విద్యాసంస్థలకు తలొగ్గిన ప్రభుత్వం ప్రజా విధానానికి, తెలుగు మాతృభాషకు వ్యతిరేకమైన నిర్ణయం తీసుకోవడం బాధకరం.**

తెలంగాణ రాష్ట్రం జాతీయ విద్యా విధానం -2020 (ఎన్ఈపీ-2020) 2025-2026 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశిస్తామని కేంద్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చి ఆ స్కీములో జాయిన్ అయింది. తత్ఫలితంగా అపార్ (ఆటోమెటిక్‌పెర్మనెంట్‌అకాడమిక్ అకౌంట్‌రిజిస్ట్రీ) కార్డుల కోసం విద్యార్థుల వివరాలను నిక్షిప్తం చేస్తూనే ఉంది. ఎన్ఈపీ- 2020 ప్రకారం ప్రాంతీయ భాషలకే ప్రాధాన్యమిస్తున్నా తెలంగాణ, ఇంటర్మీడియట్ బోర్డు ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకోవడం తెలుగు భాషను అవమానించడం కాకపోతే మరేమిటి ?

గత రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న జాతీయ సాధన సర్వే నేషనల్‌అస్సెస్‌మెంట్‌సర్వే(ఎన్ఏఎస్) తెలంగాణ రాష్ట్రం చాలా వెనుకబడి ఉంది. ఎన్ఏఎస్ రిపోర్టు -2021 ప్రకారం తెలుగు భాషలో మహా3వ తరగతి భాషా సామర్థ్యాలలో జాతీయ సగటు 62%, తెలంగాణ 48%గా నమోదయింది. 5వ తరగతి భాషా సామర్థ్యాలలో జాతీయ సగటు 55%, తెలంగాణ 43%గా నమోదయింది. 8వ తరగతిలో 53% జాతీయ సగటు 48% తెలంగాణ సగటుగా ఉంది. దాదాపు 65 శాతం మంది విద్యార్థులు తెలుగులో ఒక వాక్యం తప్పుల్లేకుండా రాయలేని దుస్థితి నెలకొని ఉంది. అక్షరమాల, గుణింతాలు, ఒత్తులు రాయలేని వారే మూడో తరగతి వరకు ఉన్నారు. 8వ తరగతి వరకు కూడా అదే పరిస్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితిని బాగు చేయాల్సింది పోయి సంస్కృతాన్ని బలవంతంగా రుద్దడం ఒక తొందరపాటు చర్య కాకపోతే మరేమిటి? తెలుగులో పాఠశాల స్థాయిలో కవితలు, పాటలు, కథలు రాసే విద్యార్థులు ఉన్న తెలుగును కాదని సంస్కృత భాషను రుద్దడం గర్హనీయం.

సంస్కృతం నేర్చుకోవడానికి ఉదాహరించడానికి తప్ప ఉపయోగపడని, సంభాషణకు అననుకూలమైన సంస్కృతం ప్రవేశపెట్టడం అంటే విద్యార్థులను రెంటికీ చెడ్డ రేవడులుగా మార్చడమే కదా! మార్కుల కోసమే ఎంచుకున్న సంస్కృతంలో 95% మార్కులు సాధించాక కూడా, మాట్లాడలేని, తమ అభిప్రాయాలను రాయలేని విద్యార్థులు చాలామంది ఎదురవుతారు. ఇలాంటి స్పష్టత లేని ఉదాహరణలు చాలా తారసపడతాయి.

**మరి సంస్కృత భాషలో అంత స్కోరింగ్ ఎలా అవుతుందంటే దేవనాగరిల్లిపులో కాకుండా తెలుగు, హిందీ ,ఇంగ్లీష్ ఏ భాషలోనైనా రాయవచ్చు. పరీక్షలో భట్టిపట్టే ప్రశ్నలే ఎక్కువగా అడుగుతారు.** ఆ ప్రశ్నలలో తార్కిక ఆలోచన, విశ్లేషణాత్మక దృష్టి, విభేదించటము, కారణాలు రాయడం, సృజనాత్మక అంశాలు కాకుండా ఎక్కువగా బట్టి జవాబులు అడుగుతారు. అవి రాయడం వల్ల అత్యధిక మార్కులు స్కోర్ అవుతాయి. ఇక కార్పొరేట్ కళాశాలలు సంస్కృత భాషకు ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం సంస్కృతాన్ని ఉద్ధరించడానికి కాదు. వారి స్వలాభం కోసమే. మిగతా సబ్జెక్టు లాగా కాకుండా, సంస్కృత అధ్యాపకుని లేదా ఉపన్యాసకుని సంవత్సరం అంతా విధుల నిర్వహణకు తీసుకోరు. చివరి మాసంలో నియమించుకొని ఒక నెల జీతంతో సంవత్సర కాలం చెప్పాల్సిన సిలబస్ అంతా ఎగ్జామ్ పాయింట్ ఆఫ్ వ్యూలో ఒక నెలలో చెప్పించి వదిలేస్తారు. పదాలకు వాక్యాలకు అర్థం రాకున్నా విద్యార్థులు బట్టి పట్టి జవాబు రాస్తారు. మంచి మార్కులు వస్తాయి.

**ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగును తొలగించి సంస్కృతాన్ని ప్రవేశపెట్టడం సరికాదు. గతంలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఉన్నత పాఠశాల స్థాయి వరకు తెలుగు తప్పనిసరి చేశారు దానిని కొనసాగించాలి.**



సంస్కృతం ప్రవేశపెట్టడానికి కారణం "మాకు భాషా స్వాతంత్రం కావాలి మాపై తెలుగుని రుద్ద వద్దు"అని కొంతమంది తల్లిదండ్రులు విద్యార్థులతో కార్పొరేట్ కళాశాలలు రెచ్చగొట్టించి అల్లర్లు చేయిస్తున్నాయి. ఇది ప్రాంతీయతకు గొడ్డలి పెట్టు. అలాంటి వారిని సంస్కృత పాఠశాలలో వేద పాఠశాలలో చేర్చి సంస్కృతాన్ని దేవ నాగరీ లిపిలోనే అభ్యసింపజేయడం ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యల్లో ఒకటి. అంతేకానీ తెలుగు భాషను బలి తీసుకోవద్దని ఒర్రంగ గొంతుకోయవద్దని భాషాభిమానులు నిరసిస్తున్నారు.

సంస్కృత భాషాభిమానులు అదే ఆ నిరసనకారులు తమిళనాడు రాష్ట్రానికి వెళ్లి "తమిళం మా మీద రుద్ద వద్దు" అని నిరసించగలరా? ఒకవేళ నిరసించి ఉండగలరా? తమిళనాడులోని పరిస్థితి ఒరిస్సాలో కర్ణాటకలో కూడా అదే పునరావృతం అవుతుంది. అంతెందుకు మొన్నటికి మొన్న ఏప్రిల్ ఏడో తారీఖు నాడు మహారాష్ట్రలోని కల్యాణ్ ప్రాంతంలో ఉన్న ధోమ్ భీవ్లి ఊరిలో రాత్రిపూట పూనం గుప్త ఆమె స్నేహితురాలు జ్యోతి చౌహన్ ఆమె చేతిలో 9 నెలల బిడ్డ స్కూటీ మీద వెళుతున్నారు. తమ ఇంటికి వెళ్లే దారిలో కొందరు కూర్చుని ఉండగా బండి నడుపుతున్న పూనం వారిని చూసి %వఞఎబంవ ఎవ% అంది. గొడవ బగ్గున రాజుకుంది. "మరాఠీ మాట్లాడతావా? మా చేతుల్లో చస్తావా? దాడి చేశారు. గొడవ ఆపడానికి వచ్చిన పూనం భర్తను కొట్టారు. (సోర్స్: సాయి వంశీ ఫేస్‌బుక్‌వాల్‌నుంచి) అట్లాంటి సంఘటనే మహారాష్ట్రలో నవనిర్మాణ సేన మరాటి మాట్లాడని ఒక సెక్యూరిటీ మీద విరుచుకుపడ్డ సంఘటన ఏప్రిల్ మాసంలోనే జరిగింది.

మహారాష్ట్రలో జరిగినట్లు కొద్దిమంది సంస్కృత భాష వద్దన్నందుకు 4 కోట్ల తెలుగు భాష మాట్లాడే తెలంగాణ ప్రాంతంలోని తెలుగు ప్రజలు విద్వేషంతో రగిలిపోతే ఆ పరిస్థితుల్లో ఆపగలిగే వారు ఎవరైనా ఉంటారా? తెలంగాణ నేల మీద ఘనత వహించిన మహారాజులు, చాళుక్య ప్రభువులు ఉర్దూ నవాబులు తెలుగు సాహిత్య సేవ చేశారు. తెలంగాణ పోరాటాల గడ్డ. ఢిల్లీ గద్దె పెకిలించిన చరిత్ర తెలంగాణకు ఉంది. నియంతృత్వాన్ని నిర్మూలించిన ఘనత తెలంగాణ భాషకు ఉంది.

అనాలోచిత నిర్ణయాలు పక్కన పెట్టండి. ఇప్పటికైనా కళ్ళు తెరవండి. ఉత్తరాది వారి కోసం తెలుగు భాషను ఉత్త భాష చేయకండి. ప్రపంచ భాషలలో 16వ స్థానం ఉన్న తెలుగు భాషను అధో పాతాల్లోనికి తొక్కకుండా ఉన్నత స్థితిని కలిగించండి.

**తెలుగు భాషను తప్పనిసరి చేయండి.**



డా. సిద్దెంకి
యాదగిరి
9441244773

## బహుజన హితుడు



పసితనంలోనే బడిలో చివరగా గుడికి దూరంగా
వివక్షతల వెతలతో బతుకు భారాన్ని మోసి
అవమానాల ఆటుపోటులను అధిగమించి
సామాజిక అసమానతల బూజు దులిపి
అనుభవాల గాయాలకు ఆత్మవిశ్వాస లేపనమద్ది
సమతా మమతా మానవతను చాటిన
మహోన్నత సంస్కరణ శీలి అంబేద్కర్

వెలివేతల కొలిమి నిలువెల్లా దహించినా
అక్షరాల ఆలింగనంతో అధ్యయనమే ఆలంబనగా
అవకాశ నిచ్చెనలను నిబ్బరంగా అందిపుచ్చుకుని
ఉన్నత శిఖరాలను అధిరోహించిన కర్తవ్యశీలి

అమితమైన పుస్తక పఠనాభిలాషతో
పుష్కలమైన జ్ఞానాన్ని మస్తిష్కంలో నింపుకున్న
అసమాన మేధోసంపన్నుడు అంబేద్కర్
జీవితంలో విలువలు నేర్పేది విద్యయని భావించి
ఆశయాలను ఆచరణలో పెట్టిన మహనీయుడు

సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టి
భారత రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతను చేపట్టి
అనేక దేశాల రాజ్యాంగాలను ఔపోసన పట్టి
రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన రాజనీతిజ్ఞుడు

సమసమాజ స్థాపనయే ప్రథమ లక్ష్యంగా
బహిష్కృత హితకారిణి సంస్థను స్థాపించి
అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేసి
దేశానికి దిశానిర్దేశం చేసిన దార్శనికుడై
ప్రజలగుండెలలో కొలువైన ఆరాధ్యుడు
చరిత్రలో నిలిచి చరితార్థుడైన చిరస్మరణీయుడు



పులి జమున
8500169682

**కవితలకు ఆహ్వానం**

## స్ఫూర్తి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం


వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాలలో రాణిస్తున్నవారికి స్ఫూర్తి పురస్కారాలు ఇవ్వాలని సంకల్పించాము. సంగీతము, సాహిత్యం, విద్య, ఉద్యోగ, జర్నలిజం, ఉపాధ్యాయ, రచన, సామాజిక సేవ, రక్తదానం, వ్యాఖ్యానం, వైద్య, వ్యవసాయం తదితర రంగాలలో రాణిస్తున్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారినుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నాము. ఆయా రంగాలలో వారు చేస్తున్న కృషిని తెలుపుతూ నామినేషన్లు పంపాలి. మా సంస్థ జ్యూరీ కమిటీ ఆయా నామినేషన్లను పరిశీలించి అర్హులైన వారికి పురస్కారాలను అందజేస్తోంది. పురస్కాల ప్రదానం హైదరాబాద్‌లో ఉంటుంది. కనుక స్వయంగా వచ్చి పురస్కారాన్ని స్వీకరించాల్సి ఉంటుంది. వివరాలకు 9885880111, 8096677409 లో సంప్రదించగలరు.

**దరఖాస్తులు పంపాల్సిన చిరునామా**
కన్వీనర్,
వసుంధర విజ్ఞాన వికాస మండలి, రినెం-4393/96,
సామాజిక సాంస్కృతిక చైతన్య వేదిక, హైదరాబాద్,

# స్వేచ్ఛ కోసం సాగిన సుదీర్ఘ పోరాటం



ఒక వ్యక్తి తనకు తానుగా పరిస్థితులతో పాటు ప్రయాణిస్తూ, అడ్డంకులను అధిగమిస్తూ, అనుభవాలను సమీకరించుకుంటూ, ఒక పరిణామ క్రమంలో వికాసం చెందడమే నిజమైన నాయకత్వం. నెల్సన్ మండేలా కూడా సరిగ్గా ఈ కోవకు చెందిన నిజమైన నాయకుడు. ప్రజా నాయకుడు.





(" స్వేచ్ఛ కోసం సుదీర్ఘ ప్రయాణం నెల్సన్ మండేలా" (ఆత్మకథ)
అనువాదం: రాపోలు సీతారామరాజు.
వెల: రూ.400. పేజీ: 342
ప్రతులకు: నవోదయ, పాలపిట్ట,
హైదరాబాద్ మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు).

ఆఫ్రికన్ సమిష్టి కుటుంబ జీవన విధానంలోని వ్యక్తిగత బాధ్యతలే మండేలాకు మొదటగా స్వీయ క్రమశిక్షణను నేర్పాయి. పాఠశాల, కళాశాల చదువులు యువకుడిగా మండేలా దృక్పథాన్ని విస్తృతం చేశాయి. భవిష్యత్తు సవాళ్లను కూడా సూచించాయి. అక్కడే మొదటిసారిగా పాశ్చాత్యులను చూశాడు. వారి ఆలోచన సరళిని గమనించాడు. ఆ ఆలోచనలకు, తన జాతి నమ్మకాలకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఆకళింపు చేసుకున్నాడు. ఆ సంఘర్షణలోంచి సున్నితత్వం, స్వీయ క్రమశిక్షణ కలిగిన ఒక కొత్త మండేలా పుట్టుకొచ్చాడని చెప్పుకోవాలి. ఇక నగర జీవితంలో అనుభవించిన పేదరికం సందర్భానికి తగ్గట్టుగా సర్దుకుపోవాల్సిన అవసరాలు మండేలాను మరింత క్రమబద్ధమైన జీవితానికి అలవాటు చేశాయి. న్యాయవాద వృత్తి మొదలుపెట్టాక ఆఫ్రికన్లు ఎదుర్కొంటున్న అనేక న్యాయ సమస్యలు అతనికి అర్థం అయ్యాయి. తక్కువ సమయంలో ఎక్కువమందికి సహాయ పడాల్సిన అవసరాన్ని గుర్తించాడు. ప్రజలు మండేలాను కేవలం ఒక నాయకుడిగాని చూడలేదు. మండేలా లో తమను తాను చూసుకున్నారు. తమకు మండేలా అవసరం ఎంతగానో ఉందని తెలుసుకున్నారు. తమను సంఘటితం చేయడానికి ,తమను ఏకతాటిపై నిలిపి అందమైన భవిష్యత్తు వైపు నడిపించడానికి అతని అవసరం ఉందని గ్రహించారు. అదే విషయాన్ని మండేలా కూడా గ్రహించాడు. ఆ ఎరుకతోనే తన పాత్రను సమర్థవంతంగా చాలా జాగరుకతతో పోషించాడు. ప్రతి అడుగును ఆచితూచి వేశాడు. మొత్తం ఉద్యమమే అతని పేరు మీదుగా నడిచేంతగా మారిపోవడం వల్ల అతను మరింత బాధ్యతాయుతంగా మరింత మానవత్వంతో ప్రవర్తించగలిగాడు.

తొలినాళ్లలోనే అందరివాడు అనిపించుకున్న మండేలా కాలం గడిచే కొద్దీ క్రమంగా ఎదిగి దక్షిణాఫ్రికా వర్ణ వివక్ష ఉద్యమానికి ప్రతినిధిగా ప్రతిరూపంగా గుర్తించబడ్డాడు. ఆ తరువాత దేశ సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధుడయ్యాడు. 1970, 80 దశకాల్లో అనేక అంతర్జాతీయ సంస్థలు అవార్డులను, డాక్టరేట్లను, సత్కారాలను ప్రధానం చేశాయి. అందులో భారత ప్రభుత్వం ఇచ్చిన జవహర్లాల్ నెహ్రూ అవార్డు కూడా ఉంది. జైల్లో ఉండటం వల్ల అవేవీ ప్రత్యక్షంగా స్వీకరించలేకపోయాడు. లీడ్స్ విశ్వవిద్యాలయం వారు తాము కనుగొన్న పరమాణు కణానికి మండేలా పేరు పెట్టుకున్నారు.ః 1988లో మండేలా పుట్టినరోజున అభినందన సందేశాలు పంపుతూ నెదర్లాండ్స్ అభిమానుల నుండి దక్షిణాఫ్రికా జైలుకు 1,70,000 ఉత్తరాలు వచ్చాయి. మండేలాకు సంఘీభావం ప్రకటిస్తూ రెండు లక్షల 50 వేల మంది లండన్ నగర వాసులు వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

దేశాధ్యక్షుడు అయ్యాక కూడా మండేలా విమర్శలను సాభిప్రాయంతోనే స్వీకరించేవాడు. స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించాం కదా అని మమ్మల్ని మానవతీతులుగా కీర్తించనక్కర్లేదు. ప్రభుత్వ పనితీరులో లోపాలు ఉంటే ప్రశ్నించాలనేవాడు. నెల్సన్ మండేలా లోని చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం, నిబద్ధత, నిజాయితీ, నిర్భీతి ,అంకితభావం, త్యాగనిరతి, మానవీయత నాయకత్వ లక్షణాలే ఆయనను సామాన్య ప్రజలకు అసమాన్యుడిని చేశాయి. దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్ష నిర్మూలనకు, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేసినందుకు గాను మండేలా నోబెల్ బహుమతి నందుకు ఉన్నారు.

రాపోలు సీతారామరాజు చేసిన ఈ అనువాదం చాలా బాగుంది. ఇందులో మండేలా గురించి మాత్రమే కాక దక్షిణాఫ్రికా చరిత్ర, నైసర్గికత, రాజకీయాలు, నేటి యువత ఆలోచనలు ఎన్నో చెప్పిన తీరులో ఓ క్రమం ఉంది. రచయిత అక్కడి ప్రాంతాల పేర్లు, మనుషుల పేర్లు వారి ఉచ్చారణకు అనువుగా రాశాడు. వాళ్ళ భాషలోని, సంస్కృతిలోని ,చరిత్రలోని, పోరాటంలోని జీవధాతువును తన అక్షరాల్లోకి తీసుకురావడంలో సఫలమయ్యారు. ముఖ్యంగా 'మండేలా మహాత్ముడు ఎలా అయ్యాడు' అని రాసిన విశ్లేషణాత్మక ముందుమాట ఈ పుస్తకానికి మరింత వన్నె తెచ్చింది. అందంగా, ఆకర్షణీయంగా ఈ పుస్తకాన్ని వెలువరించడంలో రాపోలు సీతారామరాజు చేసిన కృషి ప్రశంసనీయం.



- కేపీ అశోక్ కుమార్

# ఐపీఎల్‌కు తగ్గని క్రేజ్





- మ్యాచ్‌లు చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్న నగరవాసులు
- ఇట్ల టికెట్లు పెడుతున్నరో లేదో అట్ల ఖాళీ!
- ఎస్‌ఆర్‌హెచ్ వర్సెస్ ముంబయి మ్యాచ్ టికెట్లు కొనేందుకు లక్ష మంది క్యూ
- ఇప్పటి వరకు ఐపీఎల్ మ్యాచ్‌ల్లోనే ఇదో రికార్డు

**హైదరాబాద్ స్పోర్ట్స్ ప్రతినిధి, నేటి ప్రస్థానం:** ఐపీఎల్.. పరుగుల పండుగ! ఇరవై ఓవర్లలో మన అభిమాన క్రికెటర్ పరుగుల వరద పారిస్తుంటే చూసే తరించే ఓ ఆనంద వేడుక! ఇక ఆ పరుగుల వర్షాన్నిస్టేడియం వెళ్లి చూస్తే ఆ కిక్కే వేరప్పు! అదే హోం టీం ఎస్‌ఆర్‌హెచ్ ఆడితే ఆ సంతోషాన్నిమాటల్లో వర్ణించలేం! ఉప్పల్‌లో ఎస్‌ఆర్‌హెచ్ వర్సెస్ ముంబయి మధ్య జరిగే మ్యాచ్ అభిమానుల అంచనాలను అమాంతం పెంచేసింది. ఈ జట్ల మధ్య జరిగే సమరాన్ని కన్నులారా వీక్షించే ఫ్యాన్స్ పెరిగిపోవడంతో టికెట్లకు విపరీతమైన డిమాండ్ వచ్చేసింది. టికెట్ దొరికితే చాలు కొందామనే వారి సంఖ్య ఇప్పటికే లక్ష దాటింది. ఇది ఐపీఎల్‌లో మరో రికార్డు.

## అంచనాలను మించి...

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియం కెపాసిటీ 39,000. అయితే మాములుగా ఎప్పుడు ఫుల్ కాదు. టికెట్లు 37,000 ల వరకు అమ్ముతారు. కానీ స్టేడియంలో మాత్రం అంతకంటే ఎక్కువే అభిమానులుంటారు. నెక్స్ట్ ఉప్పల్‌లో జరగబోయే మ్యాచ్ ఎస్‌ఆర్‌ఎచ్ వర్సెస్ ముంబాయి కావడంతో ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇంకేముంది ఈ మ్యాచ్ చూసేందుకు అభిమానులు ఎగబడుతున్నారు. జుమాటో ఆధ్వర్యంలోని డిస్ట్రిక్ట్ ఆప్‌లో ఐపీఎల్ టికెట్లు విక్రయిస్తుండగా కొనేందుకు ఎగబడుతున్నారు. వివిధ కేటగిరీల్లో ఉన్న టికెట్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే లక్షమంది క్యూలో ఉండటం.. ఇదో ఐపీఎల్ రికార్డు కావడం విశేషం.

## అభిమాన క్రికెటర్లను చూసేందుకు..

ఎస్‌ఆర్‌హెచ్ వర్సెస్ ముంబయి మ్యాచ్‌ను తిలకించేందుకు అభిమానులు ఎగబడటానికి ఓ ప్రధాన కారణముంది. ముంబయి, ఎస్‌ఆర్‌హెచ్‌లో జట్లలో సీనియర్ జట్టుకు ఆడిన క్రికెటర్లు ఉండటం. ముఖ్యంగా ముంబయి జట్టులో రోహిత్ శర్మ, హార్థిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ లాంటి ఆటగాళ్లు.. వీరంతా గతంతో సీనియర్ జట్టుకు ఆడి 2024 టీ-20, 2025లో చాంపియన్స్ ట్రోఫీ గెలవడంతో స్టేడియానికి వెళితే వీరిని చూడొచ్చని క్రికెట్ అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు. అందుకే ఈ మ్యాచ్‌కు టికెట్లు దొరకడం కష్టంగా మారింది.

## మిగిలిన మ్యాచ్‌లకు ఇలాగానే..

ఎస్‌ఆర్‌హెచ్ వర్సెస్ ముంబయి మ్యాచ్‌కే ఈ క్రేజ్ ఉందనుకుంటే పప్పులో కాలేసినట్లే. ముందుముందు ఎస్ ఆర్‌హెచ్ ఢిల్లీ, కోల్‌కత్తాతో ఆడనున్నది. ఈ మ్యాచ్‌లకు అంతే క్రేజ్ ఉంటుందని క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు. ఈ మ్యాచ్‌లన్నీ ఉప్పల్‌లోనే జరుగుతుండటం.. అంతేకాక ఇప్పటికే ఎస్‌ఆర్‌హెచ్ ఐదు మ్యాచ్‌ల్లో

ఒడిపోయింది. ఇక చివరి లీగ్‌ల్లో చెలరేగి ఆడితే ప్లే ఆఫ్ల దక్కుతుంది. వీటిల్లో విజ%-%ంభించి ఆడితే ఇక ఫ్యాన్స్‌కే పండుగే.. పండుగ.. ఏ మ్యాచ్‌లో ఏం జరుగుతుందో.. ఎవరు రికార్డులు బద్ధలు కొడుతారో స్టేడియానికి వెళ్లి చేసేందుకు రెడీగా ఉండండి మరి.



# కేఎంపీ హెల్పింగ్ హాండ్స్ సేవలు అభినందనీయం

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసునూరి యుగేందర్‌రెడ్డి

**దేవరకొండ, నేటి ప్రస్థానం:** కేఎంపీ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసునూరి యుగేందర్ రెడ్డి అన్నారు. దేవరకొండకు చెందిన నల్గొండ రోడ్డులో నివాసముంటున్న మహమ్మద్ జామిన్ అలీ- జరీనాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఆయన కేఎంపీ హెల్పింగ్ హాండ్స్‌తో కలిసి ఆ కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా యుగేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్నపేదలకు కేఎంపీ హెల్ఫింగ్ హ్యాండ్ తన వంతు సాయం చేయడంతో పాటు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయుడం అభినందనీయన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మ-ున్ముందు మరిన్ని చేపట్టాలని సూచించారు. కేఎంపీ హెల్ఫింగ్ హాండ్స్ సేవల్లో తాను పాలుపంచుకుంటానన్నారు. కార్యక్రమంలో కేఎంపీ హెల్ఫింగ్ హాండ్స్ సొసైటీ నిర్వాహకులు, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము, సభ్యులు అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, దండు రవికుమార్, గ్యార యాదగిరి, ఆర్కే, కుందారపు సాయి, సురేశ్ ,అందుగుల పరమేష్, కూన భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



# చర్యలు అందరిపైనా.. తనపైనేనా

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణ రాష్ట్రంలో కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం తీరును ప్రతిపక్ష పార్టీలు సహా పలువురు ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు ఎండగడుతున్నారు. ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ కు తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు పంపిన నోటీసులపై స్మితా సబర్వాల్ తాజాగా స్పందించారు. గచ్చిబౌలి పోలీసులకు తాను పూర్తిగా సహకరించినట్లు- చెప్పారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు తెలిపారు. ఆ పోస్టును తాను రీపోస్టు చేసినట్లే 2 వేల మంది షేర్ చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటారా..? చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత కోరినట్లు స్మితా సబర్వాల్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ట్విట్టర్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేసిన గిబ్లి తరహాలో ఉన్న ఇమేజ్‌ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. సేవ్ హైదరాబాద్, సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ- అని పేర్కొన్నారు. ఆ పోస్టులో మష్రూమ్ రాక్ ఎదుట భారీ సంఖ్యలో బుల్డోజర్లు మోహరించగా, బుల్డోజర్లకు ఎదురుగా నెమలి, జింకలు ఉన్నాయి. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఇది ఫేక్ ఫొటో అంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు బీఎన్‌ఎస్ 179 సెక్షన్ కింద స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీ-సులు పంపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేసిన పోలీసులు విచారణకు పిలుస్తున్నారు.